

# కళామయూరి

## కంకరరాళ్లతో కళాఖండాలు

ఉపయోగ పడనిది ఏదీ ఈ సృష్టిలో లేదు. కాస్త ఆలోచించి, ఆలోచనకు రూపమిస్తే ప్రపంచాన్ని ఆకర్షించవచ్చు. ప్రఖ్యాతి చెందవచ్చుననే దృక్పధం కొంతమందిలోనే ఉంటుంది.

స్టోర్స్ మేనేజర్‌గా పనిచేసి







రిటైర్ అయిన జేమ్స్‌వాడ్ తన 66వ ఏట ఆలోచనలకు రూపకల్పన చేసుకుని కళా సృష్టి ప్రారంభించాడు. సముద్రతీరం వెంబడి తిరుగుతూ కనిపించిన వాటిని జేబుల్లోనూ, సంచుల్లోనూ భద్ర పరుస్తూంటే అందరూ అతన్ని చూసి నవ్వేవారు. అయితే అతను పట్టించుకునే వాడుకాదు.

సముద్రతీరం వెంబడి తిరుగుతూ సేకరించిన అందమైన రాళ్ళనీ, గవ్వలనీ, శంఖాల్ని, నత్తగుల్లల్ని జాగ్రత్త పరిచాడు.

జేమ్స్‌వాడ్‌లోని కళాకారుడు బయటికొచ్చాడు. చక్కని బోర్డులమీద, సన్‌గ్లాసులమీద బొమ్మలను చిత్రీకరించి అంటిచేవాడు. ఆ తరువాత పలచగా వార్నీష్ వేసేవాడు. ఒక్కో బొమ్మకు ఎనిమిది నుంచి పది గంటల సమయం తీసుకునేవి. అయితేనేం? చక్కని బొమ్మలు తయారయ్యేవి. వేలాది రూపాయల ఆదాయంవస్తోంది. తను అభిమానించే ప్రముఖ నటి మేర్లిన్‌మన్రో, సీన్‌కానరే, ఠాగూర్, నెహ్రూ, గాంధీ ప్రభృతుల బొమ్మలను రాళ్ళతోను, గవ్వలతోను జీవకళ ఉట్టిపడేట్టు కళాఖండాలుగా రూపొందిస్తున్నాడు. దీనివల్ల వృద్ధాప్యంలో హాయిగా గడపడమే కాకుండా చక్కని సంపాదన ఉంటోంది. ఇప్పుడు ఇతని మార్గాన్ని పలువురు అనుసరిస్తూ పిల్లలకి, పెద్దవాళ్ళకి ఆనందం కలిగిస్తున్నారు. సముద్ర తీరాల్లో చాలమందికి ఇది వృత్తి అయింది.

— వి.యస్.కె.

# మినీకథ




అప్పారావు ఓ చిరుగుమాస్తా. కాని తెలివితేటలు మాత్రం అమోఘం. అతను తన తెలివితేటలకి ఈ దేశంలో పుట్టవలసినవాణ్ణి కాదు_ అని అందరితో చెప్తూంటాడు.

అతని హాబీల్లో ఒకటి అప్పుచెయ్యటం. ఎంత డబ్బుల్లేని వాడయినాసరే అప్పారావు అప్పు అడిగాడంటే యిచ్చి తీరాల్సిందే. అంత చక్కగా మాటలు చెప్పి అప్పు సంపాదిస్తాడు. తిరిగి డబ్బు ఎప్పుడిస్తాడో ఎవరికీ తెలియదు. అయినాసరే అందరూ యిస్తారు.

అప్పారావుకి అప్పు యిచ్చిన వాళ్ళలో ప్రముఖుడు సుబ్బారావు. ఓరోజు సుబ్బారావు ఎలాగయినాసరే అప్పారావు అప్పు వసూలు చేయాలని బయల్దేరాడు.

సుబ్బారావు అప్పారావింటికి వెళ్ళేసరికి అప్పారావు గడ్డం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు.

సుబ్బారావునిచూసి అప్పారావు "రావోయ్ సుబ్బారావు, ఏమిటి సంగతులు" అని అడిగాడు.

"డబ్బులు అవసరంగా ఉంది. ఏమైనా యిస్తావేమోననివచ్చా" అన్నాడు సుబ్బారావు ఉపోద్ఘాతం ఏమీ లేకుండా.

"అలాగా.... ఇస్తాను.... గడ్డం చేసుకుని యిస్తాను." కూర్చోండని యింట్లోనుండి ఓ కాఫీ తెమ్మని చెప్పాడు.

"అహా!... కాఫీ వద్దులేవోయ్, త్వరగా గడ్డం చేసుకుని డబ్బుఇస్తే నేను వెళ్ళిపోతాను." అన్నాడు సుబ్బారావు.

అప్పారావు సీరియస్‌గా గడ్డానికి సబ్బు రాసుకుని వెంటనే యింట్లోకివెళ్ళి కడుక్కుని వచ్చేశాడు.

సుబ్బారావు లోపల్లోపల సంతోషపడుతున్నాడు "గడ్డం చేసుకుంటే ఆలశ్యం అవుతుందని ముందే లేచివచ్చి యిస్తాడుగామోసు" అనే తలపోస్తున్నాడు.

అప్పారావు సీరియస్‌గా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఎంతసేపటికీ యివ్వటల్లేదు.

సుబ్బారావు యింక ఓపికపట్టలేక "అప్పారావు డబ్బులిస్తే నే వెడతాను" అన్నాడు.

"అదేమిటోయ్ సుబ్బారావు. నేనెపుడు మాటతప్పను. గడ్డం చేసుకుని యిచ్చేస్తాను. అన్నాను. కాని నేను గడ్డంచేయలేదుకదా."

అతని తెలివితేటలకి అదిరిపోయిన సుబ్బారావు_ రోజూ అప్పారావుని చూస్తున్నాడు ఎప్పుడు గడ్డం చేస్తాడాఅని!